# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లో రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుల పురోగతిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రగతి సమీక్ష సమావేశంలో చర్చించారు**

2. **భారత్‌లో అంతరిక్ష రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

3. **బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఈ రోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**

4. **తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

==========================

దేశవ్యాప్తంగా ఉన్న పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిని ప్రగతి సమావేశం ద్వారా, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం విధానంలో నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుల పురోగతి వివరాలను ప్రధానమంత్రికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, ముద్ఖేడ్-మెద్చల్-మహబూబ్‌నగర్-డోన్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో భూసేకరణ, ప్రభుత్వ భూముల బదలాయింపు పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కర్నూలు జిల్లాలోని నాలుగు మండలాల్లోని 16 గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. నంద్యాల జిల్లాలో భూ సేకరణకు నోటిఫికేషన్ ఇప్పటికే జారీ చేసినట్లు వెల్లడించారు.

------------------------

స్ట్రాటోఆవరణంలో శాస్త్రీయ పరిశోధనలు, టెలీకమ్యూనికేషన్ల కోసం ఉపయోగించే భారత తొలి సూపర్ ప్రెజర్ బెలూన్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఆవిష్కరించారు. ఈ బెలూన్‌లో ఆరు పేలోడ్‌లతో పాటు పలు సెన్సార్లను అమర్చి ప్రయోగించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రోత్సాహంతో భారత్‌లో అంతరిక్ష రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. టవర్లు లేని గ్రామాలు, గిరిజన, తీర ప్రాంతాల్లో కూడా ఈ సాంకేతికత సిగ్నల్స్ అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని తెలియజేస్తూ...

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ఈ రోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ముస్లింలు జరుపుకునే పండుగల్లో రంజాన్ తర్వాత బక్రీద్‌కు అత్యంత ప్రాముఖ్యతనిస్తారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్, ఉభయ తెలుగు రాష్ట్రాల గవర్నర్లు ఎస్.అబ్దుల్ నజీర్, శివ ప్రతాప్ శుక్లా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లింలకు తమ శుభాకాంక్షలు తెలియచేశారు.

---------------------------

బక్రీదు సందర్భంగా జంతువుల వధ, రవాణా, సంరక్షణకు సంబంధించిన ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు నిన్న ఒక ప్రకటనలో సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో నిషేధిత జంతువులను వధించడం చట్టవిరుద్ధమని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

---------------------------

తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు రేవంత్ రెడ్డి నిన్న లేఖ రాశారు. గతంలో 148 మీటర్ల జలాశయం నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే ఆ స్థాయితో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు పూర్తిగా తీరవని రేవంత్‌రెడ్డి తెలిపారు. నీరు నిల్వ ఉండే గరిష్ఠ స్థాయి –ఎఫ్ఆర్ఎల్‌ను పెంచితే తెలంగాణకు నీటి సరఫరా సులభమవుతుందని పేర్కొన్నారు. అలాగే ఎఫ్ఆర్ఎల్ పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం కూడా తక్కువగానే ఉంటుందని వివరించారు.దీనిపై చర్చించేందుకు తెలంగాణ ప్రతినిధి బృందం సమావేశానికి తేదీ ఖరారు చేయాలని లేఖలో కోరారు.

---------------------------

వచ్చే ఏడాది జగరనున్న గోదావరి పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ రెండు రోజుల తూర్పుగోదావరి జిల్లా పర్యటనపై రాజమహేంద్రవరంలో మంత్రి నిన్న పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుష్కరాలు జరిగే ఆరు జిల్లాల అభివృద్ధికి సుమారు 8 వేల 500 కోట్ల రూపాయల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. గోదావరి కాలుష్య నివారణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి పేర్కొంటూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ గత 12 సంవత్సరాల్లో ప్రజాహిత పరిపాలన అందిస్తూ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలు తమ జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయని, ఈ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నామని నంద్యాల జిల్లాకు చెందిన లబ్ధిదారులు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా సొంత ఇంటి .. కల సాకారమైందని నంద్యాలకు చెందిన లబ్ధిదారు వెంకటేశ్వర్లు తెలిపారు.

అలాగే ముద్ర యోజన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పొందేందుకు ఉపయోగపడిందని లబ్ధిదారు ఇబ్రహీం ఖాన్ పేర్కొన్నారు.

వాయిస్ ..20.. సెకన్లు

---------------------------

అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలంగాణ పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిస్థితిపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి దృశ్య మాధ్యమ విధానంలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు నష్టం రాకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో నిన్న అత్యధికంగా 41.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. కోస్తా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈరోజు 45-46 డిగ్రీల మేర గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే ఉత్తర తమిళనాడు దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దక్షిణ తెలంగాణ వరకు ద్రోణి విస్తరించి ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 134వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు రేపు సాయంత్రం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో జరిగిన పడవ ప్రమాద ఘటనపై మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు నిన్న ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారీ ఈదురుగాలుల కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు మత్స్యకారులు మృతి చెందగా, మరో ఇద్దరు గల్లంతయ్యారని వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి పది లక్షల రూపాయల నష్టపరిహారం అందజేస్తామని ప్రకటించారు.

=====================